

సెలవుల్లో కంప్యూటర్ శిక్షణ
విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. -8లో



పోటెత్తిన భక్తులు
యాదగిరి క్షేత్రానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. -8లో

గరిష్టం/కనిష్టం
35°/27°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వరికొయ్యలు కాలిస్తే భూసారం తగ్గుతుంది



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

తాళ్లగడ్డ (సూర్యాపేట): పొలాల్లో వరికొయ్యలు, ఎండు గడ్డిని కాలిస్తే భూసారం తగ్గడంతోపాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని డీఏఓ జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం సూర్యాపేట మండలం కుసుమవారిగూడెంలో రైతుల పొలాలను సందర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలోని వరికొయ్యలు, గడ్డికి, వ్యర్థాలకు నిప్పు పెడితే భూమిలో పంటలకు మేలు చేసే ఎరలు నశిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ బి.కృష్ణ సందీప్, ఏఈఓ ముత్తయ్య, రైతులు వెంకట్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తుంగతుర్తి : అర్హత కలిగిన దివ్యాంగులు, వయోవృద్ధులు సహాయ ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహారావు అన్నారు. శనివారం తుంగతుర్తి ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ దరఖాస్తులను అలింకో సంస్థ వారు పరిశీలించి అర్హత కలిగిన దివ్యాంగులకు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాలు అందిస్తారన్నారు. ఇప్పటివరకు 150 అర్హత ఉన్న దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుకుమార్, సీడీపీఓ శ్రీజ, సూపర్‌వైజర్స్ మంగమ్మ, ఖైరున్నిషా, ప్రమీల, అలింకో స్టాఫ్ రష్మీ రంజన్, రాజా బాబు, సాయి, సంజీవ, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన వృత్యంతర శిక్షణ



ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు సంధ్యారాణిని సన్మానిస్తున్న డీఈఓ అశోక్

సూర్యాపేట : చివ్వెంల మండలం దురాజ్‌పల్లి సమీపంలోని స్వామి నారాయణ గురుకులంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మొదటి విడత వృత్యంతర శిక్షణ శనివారం ముగిసింది. చివరి రోజులు ఆర్పీలు తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గంలోని గణితం, సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టు టీచర్లతోపాటు ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 750 మందికిపైగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మిగతా నియోజకవర్గాల ఉపాధ్యాయులకు ఈనెల 20 నుంచి రెండో విడత శిక్షణ అందించనున్నట్లు డీఈఓ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్వాలిటీ కంట్రోల్ అధికారి జనార్దన్, సెక్టోరియల్ అధికారులు రాంబాబు, శ్రవణ్‌కుమార్ పర్యవేక్షించారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆపిల్ స్కాన్ సెంటర్ నిర్వహిస్తున్న డాక్టర్ కిరణ్ కేవలం ఎంబీబీఎస్ మాత్రమే పూర్తి చేసి ఎంబీబీఎస్, ఎండి రేడియాలజిస్టుగా ఫోర్జరీ చేసిన నకిలీ సర్టిఫికెట్స్ సృష్టించి అనుమతి పొందాడు. ఈ స్కానింగ్ సెంటర్ పేరును 2013లో రిజిస్టర్ చేసుకోగా గతేడాది సెప్టెంబర్‌లో దీనిని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుడ్డిగా రెన్యువల్ చేసింది.

జిల్లా కేంద్రంలో సాయి గణేష్ ఆసుపత్రి నడిపిస్తున్న డాక్టర్ సందీప్ కుమార్ చైనాలో ఎంబీబీఎస్ పూర్తిచేసి 2019 నుంచి సూర్యాపేటలో ఎండి డాక్టర్‌గా చలామణి అవుతూ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నడిపిస్తున్నాడు. సర్టిఫికెట్‌ను కూడా రెన్యువల్ చేసుకోలేదు. రెండేళ్లుగా ప్రాక్టీస్ చేయడం లేదని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు మెడికల్ కౌన్సిల్ సభ్యులు తమ తనిఖీల్లో నిర్ధారించారు.

జిల్లా కేంద్రంలో శ్రీ కృష్ణ ఆసుపత్రి నిర్వహిస్తున్న డాక్టర్ రవిశేఖర్ అనస్థీషియాగా అర్హత ఉన్నా జనరల్ ఫిజీషియన్‌గా అవతారమెత్తి సర్జరీలు చేస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. అంతేకాకుండా ఆసుపత్రిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహిస్తుండగా అందులో పనిచేస్తున్న రేడియాలజిస్ట్ సైతం ఏపీలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఉండడం కొసమెరుపు. ఇలా జిల్లా కేంద్రంలోనే కాకుండా జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో అనుమతుల్లేని ఆసుపత్రులు, అర్హతలేని వైద్యులతో వైద్యసేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ప్రక్షాళన!

అనుమతుల్లేని ఆసుపత్రుల్లో మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీలు

- వెలుగులోకి పలు వాస్తవాలు
- ఆర్డీఓ నేతృత్వంలోనూ ఐఎంఏ, ప్రత్యేక బృందాల ఆరా
- ఇప్పటికే 55కిపైగా రిజిస్ట్రేషన్ లేని ఆసుపత్రుల గుర్తింపు
- 17 ఆసుపత్రులకు నోటీసులు, రెండు స్కానింగ్ సెంటర్లు సీజ్
- శనివారం డీఎంహెచ్ఓ ఆఫీస్‌లో రాష్ట్ర వైద్య బృందం విచారణ

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వం జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రక్షాళనకు పూనుకుంది. జిల్లా కేంద్రంలో పలు ప్రైవేట్ ఆసుపత్రులు అనుమతుల్లేకుండా కొనసాగుతున్నాయని, అర్హతలేని డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్, సూర్యాపేట ఐఎంఏ నిర్వహించిన సంయుక్త సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు చేపట్టింది. దీంతో పలు వాస్తవాలు వెలుగు చూశాయి. అనుమతులు, అర్హతలు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై వచ్చిన ఫిర్యాదులతో ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం సభ్యులు జిల్లా కేంద్రంలో తనిఖీలు చేపట్టి ఏకంగా 55 ప్రైవేట్ ఆసుపత్రులు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో 17 ఆసుపత్రులకు నోటీసులు ఇచ్చి, రెండు స్కానింగ్ సెంటర్లను సీజ్ చేశారు.

మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీల్లో..

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం తనిఖీల్లో



సూర్యాపేటలో యాపిల్ స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేసిన డీఎంహెచ్ఓ (ఫైల్)

సూర్యాపేటలోని శరత్ కార్డియాక్ సెంటర్‌లో డాక్టర్ లేకుండానే ఆపరేటరే నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. 13 ఏళ్లుగా అర్హతలు లేకుండా నకిలీ సర్టిఫికెట్‌తో చలామణి అవుతున్నట్లు తేలింది. దీంతోపాటు మరో ఆసుపత్రి సర్టిఫికెట్ వ్యాలిడిటీ పూర్తయ్యాక కూడా రెన్యువల్ చేసుకోనట్టు నిర్ధారించారు. ఈ దాడుల్లో ఏకంగా 55 ఆసుపత్రులను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తేల్చారు. దీనిపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు రిపోర్టు అందించగా చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. డీఎంహెచ్ఓ, ఐఎంఏ డాక్టర్లు, సూర్యాపేట ఆర్డీఓ నేతృత్వంలో మూడు బృందాలుగా ఏర్పడి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లలో తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో 17 ఆసుపత్రులకు నోటీసులు ఇచ్చి, రెండు స్కానింగ్ సెంటర్లను సీజ్ చేశారు. దీంట్లో భాగంగా శనివారం రాష్ట్ర వైద్య బృందం జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా అర్హత, అనుభవం లేకున్నా స్కానింగ్ సెంటర్‌లు, ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చారనే ఆరోపణలపై విచారణ చేశారు.

సంచలనంగా మారిన డీఎస్పీ, సీఐ ఏసీబీ ట్రాప్..

ఇటీవల అర్హతలు, అనుమతులు లేకుండా నడిపిస్తున్న యాపిల్ స్కానింగ్ సెంటర్, శ్రీసాయిగణేష్ మల్టీస్పెషాలిటీ, శ్రీకృష్ణ ఆసుపత్రులను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు గుర్తించారు. వీటిపై సూర్యాపేట ఐఎంఏ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ మూడు ఆసుపత్రుల డాక్టర్లపై కేసు నమోదు చేశారు. ఇదే కేసులో యాపిల్ స్కానింగ్ సెంటర్ డాక్టర్‌కు బెయిల్ ఇచ్చేందుకు సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, పట్టణ సీఐ వీరరాఘవులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. రాష్ట్రంలో ఈ కేసు సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రక్షాళనకు పూనుకుంది.

● **డుగ్గుడుగ్గు.. తుక్కు తుక్కు**



కోదాడ పట్టణంలో శనివారం అధిక శబ్దం చేస్తూ తిరుగుతున్న ద్విచక్రవాహనాలను పోలీసులు పట్టుకుని వాటి సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని స్టేషన్‌కు ఎదురుగా రోడ్డుపై ఉంచి రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. - కోదాడరూరల్

21 కేంద్రాల్లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- డీఐఈఓ భానునాయక్

సూర్యాపేటటౌన్ : ఈ నెల 22వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి(డీఐఈఓ(భాను నాయక్ తెలిపారు. శనివారం సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం ఫెయిల్ అయిన వారు, ఇంప్రూవ్‌మెంట్ రాసేవారు 8,600 మంది ఉన్నారని తెలిపారు. వారికోసం 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో 8 పరీక్ష కేంద్రాలు, కోదాడలో ఐదు పరీక్షా కేంద్రాలు, హుజూర్‌నగర్‌లో రెండు, తుంగతుర్తిలో రెండు, మఠంపల్లి, నేరేడుచర్ల, తిరుమలగిరి, నడిగూడెంలో ఒక్కొక్క పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీ సభ్యులు, ప్రిన్సిపాల్స్ రాజమోహన్, విజయనాయక్, సీనియర్ అధ్యాపకులు జి.లక్ష్మయ్య, జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు వీడీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈఓ భానునాయక్

ఉమ్మడి జిల్లా చెస్ జట్లకు 25న ఎంపిక పోటీలు

సూర్యాపేట అర్బన్: ఈ నెల 25న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్–11, 17 బాలబాలికల విభాగాలకు సంబంధించిన చెస్ జట్లకు క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్, కార్యదర్శి ఎల్.సతీష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల ద్వారా ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.సతీష్ కుమార్ సెల్: 9394753343 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్

చివ్వెంల: పారిశుద్ధ్య, మున్సిపల్ కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్ అన్నారు. శనివారం సూర్యాపేనట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కార్మిక చట్టాలపై మున్సిపల్ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేట జిల్లాను క్లీన్ సిటీ జాబితాలో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా కార్మికుల హక్కులు, విధులు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, డిఫెన్స్ కౌన్సిల్స్ బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పెండెం వాణి, మమత, న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫర్హీన్ కౌసర్

కాంటాలు త్వరగా పూర్తిచేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

పెన్‌పహాడ్, మోతె: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు త్వరగా పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. శనివారం పెన్‌పహాడ్ మండలం అనంతారం, అనాజిపురంతోపాటు మోతె మండలం రావిపహాడ్, బీక్యాతండాలో కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ఎప్పటికప్పుడు తేమశాతం చూసిన ధాన్యాన్ని కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాలకు అవసరమైన లారీలను పంపిస్తామని వెంటనే బస్తాలు ఎగుమతి చేయాలన్నారు. ట్రక్కు షీట్ రాగానే ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సూచించారు. ఆయన వెంట పెన్‌పహాడ్ తహసీల్దార్ లాలు, మోతె డీటీ లావణ్య, ఏఓ అరుణారెడ్డి, ఏపీఎంలు అజయ్‌నాయక్, వెంకయ్య, ఏఈఓ ఝాన్సీ, సీఈఓ సైదులు, ధనలక్ష్మి, సుధాకర్ ఐకేపీ సిబ్బంది ఉన్నారు.



మోతె : కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

యువ వికాసానికి ‘సిబిల్’ గుబులు

- సిబిల్ స్కోర్ 700కు తక్కువుంటే రుణాలు కష్టమే
- రూ.50 వేల కంటే ఎక్కువ రుణానికి పాన్‌కార్డు తప్పనిసరి
- 52,069 మంది దరఖాస్తు
- రూ.4లక్షల రుణానికి 80 శాతం మంది..

తిరుమలగిరి (తుంగతుర్తి): యువతకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుదారుల్లో బ్యాంకు సిబిల్ స్కోర్ గుబులు పట్టుకుంది. రాజీవ్ యువ వికాసం పథకం కింద వివిధ కార్పొరేషన్ల ద్వారా రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు వ్యక్తిగత రాయితీ రుణాలు ఇచ్చేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల నిరుద్యోగ యువత నుంచి జిల్లా అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 52,069 మంది దరఖాస్తులు అందాయి. ఇదంతా బాగానే ఉన్నా యువ వికాసం రుణాలు రావాలంటే తప్పనిసరిగా బ్యాంకు సిబిల్ స్కోర్ 700 దాటితేనే రుణాలకు అర్హులని అధికారులు పేర్కొంటున్నారు. అయితే బ్యాంకులకు పంపిన దరఖాస్తు ఫారాల అభ్యర్థుల సిబిల్ స్కోర్‌ను చూసి మరలా వాటిని కార్యాలయానికి



పంపుతారు. బ్యాంకు సిబ్బంది అందుకు పాన్ కార్డు ప్రామాణికంగా చేసుకొని జాబితాను తయారు చేయనున్నారు. సిబిల్ స్కోర్ ప్రామాణికంగా రాజీవ్ యువ వికాసం రుణాలు అందిస్తామనడంతో దరఖాస్తుదారుల్లో అయోమయం నెలకొంది.

రూ.4 లక్షల రుణానికి అధిక అర్జీలు

రాజీవ్ యువ వికాసం పథకం కింద ఇచ్చే రుణాల్లో అత్యధికులు రూ.4 లక్షల రుణం కావాలని దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. ఉపాధి నిమిత్తం వివిధ రకాల వ్యాపారులకు ఒక్కో రకమైన యూనిట్ విలువను ముందుగానే కేటాయించారు. దరఖాస్తుదారులు ఆ రకంగా అందులో తమకు నచ్చిన వ్యాపారాన్ని ఎంచుకోవాలి. రూ.50 వేలు రుణం తీసుకుంటే 100 శాతం రాయితీ కల్పిస్తారు. అంటే తిరిగి రుణం చెల్లించాల్సిన అవసరం ఉండదు. మిగతా రూ.50 నుంచి రూ.లక్ష వరకు 90 శాతం రాయితీ, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు రుణం తీసుకుంటే 70 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ప్రస్తుతం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్ర స్థాయిలో అర్హుల పరిశీలన కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్లు కలిపి 52,069 మంది రుణాలకు దరఖాస్తులు చేసుకోగా ఇందులో 80 శాతం మంది రూ.4 లక్షల రుణం కావాలని పేర్కొనడం విశేషం.

కార్పొరేషన్ల వారీగా దరఖాస్తుల

ఎస్సీ : 15,439	ఎస్టీ : 8,706
బీసీ : 27,481	ఈబీసీ : 504
క్రిస్టియన్ మైనార్టీ 72	ముస్లిం మైనార్టీ 3,275

మహిళలకు ప్రత్యేక కోటా

కొత్తగా మొదటిసారి రుణం తీసుకునే వారికి ఇందులో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీనికి తోడు సంబంధిత వ్యాపారంలో అనుభవం ఉండే వారికి సైతం ప్రాధాన్యత కల్పించనున్నారు. మొత్తం కోటాలో దివ్యాంగులకు 5 శాతం, మహిళలకు 20 శాతం యూనిట్లు కేటాయించాలని ఉత్తర్వులు ఉన్నాయి.

పేదల ‘ఉపాధి’కి ఎసరు!

- ఉపాధిహామీ పనిదినాలు తగ్గింపు
- పరిమితులు విధించిన కేంద్రం
- ఆందోళనలో కూలీలు



నాగారంలో ఉపాధి పని చేస్తున్న కూలీలు

నాగారం : కేంద్ర ప్రభుత్వం పేదల ఉపాధికి ఎసరు పెట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి కేంద్రం పరిమితులు విధించింది. ఈ పథకంలో పనిదినాలు తగ్గించింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉపాధిహామీ పథకం కింద ప్రతి వేసవిలో మూడు నెలలపాటు కూలి పనులు దొరకడంతో కూలీల జీవనం సజావుగా సాగేది. కూలీలకు రోజువారీ కూలి గరిష్ఠంగా రూ.260 వరకు వచ్చేంది. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ఉపాధి పనులకు పోతే రోజుకు రూ.750 వరకు కూలి వచ్చేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులు తగ్గించడం తమ జీవనోపాధిని దెబ్బతీయడమేనని కూలీలు వాపోతున్నారు.

జిల్లాలో ఉపాధి కూలీల సంఖ్య	3.36 లక్షలు
2024–25లో పనిదినాల కేటాయింపు	57.42 లక్షలు
2025–26 ఆర్థిక సంవత్సరానికి	32.92 లక్షలలు

ప్రభుత్వ పనులపైనా ప్రభావం..

ఉపాధిహామీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం రహదారులు, గ్రామ పంచాయతీ భవనాలు, పశువుల పాకలు, పౌల్ట్రీలు, చేపల కుంటలు, పండ్ల తోటలు పెంపకాలు, చెక్ డ్యామ్ నిర్మాణాలు వంటి పనులకు వినియోగిస్తుంది. ఉపాధిహామీ పనిదినాలను తగ్గించడంతో ప్రభుత్వ అభివృద్ధి పనులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని పీఆర్ శాఖ అధికారులు అంటున్నారు.

తగ్గించిన పనిదినాలు 24.05 లక్షలు

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా 3.36 లక్షల మంది కూలీలు ప్రతి ఏడాది పనులకు వెళ్తున్నారు. మొత్తం 2.63 లక్షల జాబ్ కార్డులుండగా 5.70లక్షల మంది రిజిస్టర్డ్ కూలీలున్నారు. 2024–25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం నుంచి 57.42 లక్షల పనిదినాలు కేటాయించగా ప్రస్తుతం 2025–26 సంవత్సరానికి కేవలం 32.92 లక్షల పనిదినాలు కేటాయించింది. దాదాపు 24.05 లక్షల పనిదినాలు తగ్గించడంపై కూలీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వందరోజులు పని కల్పించాలి



కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులను తగ్గించడం సరైంది కాదు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలి. వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత మూడు నెలల పాటు ఉపాధి పనికి వెళ్లి జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు పనిదినాలు తగ్గిస్తే ఎలా బతకాలి.
– గుండాల కొమరయ్య, ఉపాధి కూలీ, తుంగతుర్తి

పనులు కొనసాగుతున్నాయి



ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం 2025–26గాను సూర్యాపేట జిల్లాకు 32.92 లక్షల పనిదినాలు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాకు కేటాయించిన పనులను చేపడుతున్నాం. నిర్దేశిత సమయంలోనే పనుల లక్ష్యాన్ని చేరుకుంటాం.
– వీవీ. అప్పారావు, డీఆర్డీఓ, సూర్యాపేట

సహకార డ్రోన్‌లు



ఏఐఎఫ్ పథకం కింద పీఏసీఎస్‌లకు సబ్సిడీ ద్వారా అందజేత

- రైతులకు ప్రయోజనం కలిగేలా తక్కువ ధరకే మందుల పిచికారీ
- సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టికి దోహదం
- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 107 సంఘాలు

నల్లగొండ అగ్రికల్చర్ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) డ్రోన్‌లను అంజేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్(ఏఐఎఫ్) పథకం కింద వాటిని సబ్సిడీపై సంఘాలకు అందజేయనుంది. ఉమ్మడి జిల్లాలోని 107 సహకార సంఘాలకు వానాకాలం సీజన్ నాటికి డ్రోన్‌లను అందజేసి రైతుల వరి, పత్తి చేలకు పురుగుల మందులను పిచికారీ చేయించే విధంగా డీసీసీబీ పాలకవర్గం ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే డీసీసీబీ పాలకవర్గం ఆయా డ్రోన్ కంపెనీలతో సంప్రదింపులు చేపట్టింది. కంపెనీల నుంచి టెండర్లను పిలిచి తక్కువ ధరకు క్వాలిటీ డ్రోన్‌లను ఇచ్చే కంపెనీలకు సరఫరా బాధ్యతలను అప్పగించనున్నట్లు సమాచారం.

ఆర్థికంగా పరిపుష్టి సాధించనున్న సంఘాలు..

జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి సహకార సంఘాలకు డ్రోన్‌లను సబ్సిడీపై అందజేయడం ద్వారా ఆయా సంఘాలను ఆర్థికంగా పరిపుష్ట చేయాలన్న లక్ష్యంతో బ్యాంకు పాలకవర్గం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో డ్రోన్‌ల వ్యాపారులు ఎకరాకు రూ.500 చొప్పున తీసుకుంటున్నారు. కానీ సహకార సంఘాల డ్రోన్ల ద్వారా మందులను పిచికారీ చేస్తే ఎకరానికి రూ.300 చొప్పున ధరను నిర్ణయించనున్నారు. దీంతో రైతులకు తక్కువ ధరకే మందులను పిచికారీ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అదే విధంగా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉంటుంది. రోజు పది గంటలపాటు మందులు పిచికారీ చేసినా రూ.30 వేల వరకు సంఘాలకు లాభం చేకూరే అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఆయా సంఘాల్లోని డ్రోన్‌లను ఆపరేట్ చేసేందుకు నిరుద్యోగులకు కూడా ఉపాధి లభిస్తుంది.

రైతులకు ప్రయోజనం



కేంద్ర పభుత్వ ఏఐఎఫ్ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలకు డ్రోన్లను సబ్సిడీపై అందజేయాలని నిర్ణయించాం. డ్రోన్ల ద్వారా మందులను తక్కువ ధరలో పిచికారీ చేయడం వల్ల రైతులకు ప్రయోజనం కలుగుంది. సంఘాలకు లాభాలు వస్తాయి. వానాకాలం సీజన్ వరకు డ్రోన్‌లను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. – కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

సంఘానికి ఒకటి లేదా రెండు..

జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి 107 సంఘాలకు సభ్యుల సంఖ్య ఆధారంగా ఒక్కో సంఘానికి ఒకటి లేదా రెండు డ్రోన్‌లను సబ్సిడీ అందజేయాలని పాలకవర్గ నిర్ణయించింది. సంఘాల డిమాండ్ మేరకు రాబోయే వానాకాలం నుంచే డ్రోన్‌లను సరఫరా చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని ఇండస్ట్రియల్ పార్కు వెనుక శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 42 నుంచి 45 ఏళ్ల మధ్యన ఉంటుందని, అతడి కుడి చేతిపై అనుశ్రీ అని పచ్చబొట్టు ఉందని, శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పోలీసులు పేర్కొన్నారు. మృతుడు వడదెబ్బతో లేదా ఇతర అనారోగ్యంతో మరణించి ఉండవచ్చని పోలీసులు ప్రాథమిక నిర్ధారణ చేసినట్లు తెలిసింది. మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపేట: కడుపునొప్పితో బాధపడుతూ పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఈ ఘటన రాజాపేట మండలం చల్లూరు గ్రామంలో శనివారం జరిగింది. వివరాలు.. చల్లూరు గ్రామానికి చెందిన గుంటి అశోక్(47) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ అతడు చికిత్స చేయించుకుంటున్నాడు. ఈ నెల 9వ తేదీ ఉదయం అశోక్ తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో భార్య మాధవి ఫోన్ చేయగా అశోక్ ఫోన్ ఎత్తలేదు. దీంతో ఆమె వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూసేసరికి అశోక్ పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో కనిపించాడు. వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చి అశోక్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైసయ్య తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

భూ తగాదాలతో వ్యక్తిపై గొడ్డలితో దాడి



గాయపడిన మిర్యాల శేఖర్‌రెడ్డి

తాళ్లగడ్డ (సూర్యాపేట): భూ తగాదాలతో వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన సూర్యాపేట మండలం తాళ్ల ఖమ్మంపహాడ్‌లో శనివారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్ల ఖమ్మపహాడ్ గ్రామానికి చెందిన మిర్యాల శేఖర్‌రెడ్డి(47) గ్రామంలో తనకున్న ఒక గుంట స్థలంలో చెట్లను కొట్టేసి చదును చేస్తుండగా.. అదే గ్రామానికి చెందిన ఎస్‌కే గౌస్, ఎస్‌కే సమీర్, ఎస్‌కే మైమూద్, ఎస్‌కే మల్సూర్, ఎస్‌కే అమీరా, ఎస్‌కే మున్నాభి పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని మిర్యాల శేఖర్‌రెడ్డిపై గొడ్డలి, మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శేఖర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి మిర్యాల అమృతారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట రూరల్ ఎస్ఐ ఎస్. బాలునాయక్ తెలిపారు.

సెలవుల్లో.. కంప్యూటర్ శిక్షణ

సమ్మర్ స్పెషల్

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు, యువత
- క్రీడలతో సమానంగా పిల్లలకు నేర్పించేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

తాళ్లగడ్డ (సూర్యాపేట): ఒకప్పుడు వేసవి సెలవులు వచ్చాయంటే చాలు విద్యార్థులు, యువత తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ లేదా స్విమ్మింగ్, కరాటే, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివి నేర్చుకునేవారు. మరికొందరు సంగీతం, వివిధ రకాల కళలను నేర్చుకునేవారు. కానీ ప్రస్తుత ఆధునిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు వేసవి సెలవుల్లో కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకనుగుణంగానే పట్టణాల్లో కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లు విద్యార్థులు, యువతతో కళకళలాడుతున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల యువత, విద్యార్థులు వేసవి సెలవుల్లో ప్రతిరోజు వచ్చి కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లలో చేరి శిక్షణ పొందుతున్నారు. కొందరు ఉపాధి కోసం మరికొందరు ఉన్నత చదువుల కోసం, ఇంకొందరు ఉద్యోగోన్నతి కోసం కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నారు.

ఆకట్టుకుంటున్న నిర్వాహకులు..

సూర్యాపేట పట్టణంలో కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌ల సంఖ్య పెరగడంతో పోటీని తట్టుకునేందుకు పలువురు నిర్వాహకులు ఫీజులో రాయితీ కూడా కల్పిస్తున్నారు. వేసవి కాలం కావడంతో ఎక్కువగా యువత, చిన్నారులు శిక్షణకు వస్తుండటంతో బ్యాచ్‌కు 10 నుంచి 5 మంది చొప్పున, ప్రతిరోజు 10 బ్యాచ్‌ల వరకు నడుపుతున్నారు. నెల రోజులు పాటు ఇచ్చే శిక్షణకు గాను రూ.2000 వరకు తీసుకుంటున్నారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందిన ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు పలువురు నిర్వాహకులు తెలిపారు.



కంప్యూటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఫోన్ వద్దని కంప్యూటర్ క్లాసులకు..



ఇంటి దగ్గర ఫోన్ వాడుతుండటంతో మా అమ్మానాన్నలు ఫోన్‌కి బదులుగా జీవితంలో ఉపయోగపడే కంప్యూటర్ నేర్చుకోమని ఇనిస్టిట్యూటల్‌లో జాయిన్ చేశారు. కంప్యూటర్ కొంతమేర నేర్చుకున్నాను. చాలా హ్యాపీగా ఉంది. – ఈషాన్, 8వ తరగతి, సూర్యాపేట

కొన్ని కోర్సులకు మంచి డిమాండ్

యువత కంప్యూటర్ కోర్సులో ఎంఎస్ ఆఫీస్ నేర్చుకునేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. ఆ తర్వాత ఫొటోషాప్, డీటీపీ, టాలీ, ఆటో కాడ్ వంటి కోర్సులు నేర్చుకుంటున్నారు. వీటి తర్వాత పీజీడీసీఏ ఆరు నెలల కోర్సు కావడంతో అవసరం ఉన్న వారు మాత్రమే దానిని ఎంచుకుంటారు. శిక్షణ పొందిన వారు కొందరు ఇంటర్‌నెట్ సెంటర్లలో, కాలేజీలు, ఆస్పత్రుల్లో కంపూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

భవిష్యత్ కోసం..



నేను పదో తరగతి పూర్తి చేశాను. సూర్యాపేట పట్టణానికి 15 కిలోమీటర్ల దూరం ఉన్న గుంజలూరు నుంచి రోజూ వచ్చి కంప్యూటర్ నేర్చుకుంటున్నాను. ఉన్నత చదువుల కోసం, భవిష్యత్‌లో ఉద్యోగ ప్రయత్నాల్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎంఎస్ ఆఫీస్ నేర్చుకుంటున్నాను. – ప్రదీప్, 10వ తరగతి, గుంజలూరు

ఉపాధి పొందేందుకు ఉపయోగం



వేసవి సెలవులను వృథా చేయకుండా ప్రస్తుతం సూర్యాపేట పట్టణంలోని ఈసీఎస్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌లో టాలీ నేర్చుకుంటున్నాను. కాల వ్యవధి లోగా టాలీపై పట్టు సాధించి ఏదైనా ప్రైవేట్ ఉద్యోగంలో చేరాలనేదే నా లక్ష్యం.. – నసీర్, డిగ్రీ, సూర్యాపేట

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలోనైనా కంప్యూటర్ అనుసంధానంగానే పనులు జరుగుతున్నాయి. గతంతో అవసరం ఉంటేనే కంప్యూటర్ నేర్చుకునేవారు.. కానీ నేడు కంప్యూటర్ నేర్చుకొని ఉండటం తప్పనిసరి. శిక్షణ అనంతరం కొంత మందికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తున్నాము. మా వద్ద శిక్షణ తీసుకున్న వారు కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. – ఎండీ మహ్మద్, కంప్యూటర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు

యాదగిరి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



దర్శనం కోసం ముఖ మండపం క్యూలో నిల్చున్న భక్తులు

- 40వేలకు పైగా దర్శించుకున్న భక్తులు
- ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా సమయం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ముఖ మండపం, ప్రసాద విక్రయశాల, ఇతర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అధికంగా రావడంతో ధర్మ దర్శనానికి 3గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామిని 40వేలకు పైగా భక్తులు దర్శించుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.42,32,003 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

నృసింహుడి సన్నిధిలో విశేష పూజలు..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వామి, అమ్మవార్లకు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం చేపట్టారు. సాయంత్రం జోడు సేవలను మాడ వీధిలో ఊరేగించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా..?

- క్యూలైన్లలో భక్తుల సమస్యలు తెలుసుకున్న ఈఓ వెంకట్రావ్

వేసవి సెలవుల్లో శ్రీయాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. శనివారం సుమారు 40వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వెంకట్రావ్ శనివారం క్యూలైన్లలో, మాఢ వీధుల్లో తిరుగుతూ భక్తుల సమస్యలు తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా అని భక్తులను అడిగారు. ఎండల తీవ్రతకు, ఉక్కపోతకు భక్తులు ఇబ్బందులుపడకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో వెంట్రావ్ పేర్కొన్నారు. కొండ కింద శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం వెంటనే ఏసీలు బిగించాలని అధికారులను ఆదేశించారు. వ్రత పూజల్లో పాల్గొనే భక్తులకు సామాగ్రి, రవ్వ ప్రసాదంతో పాటు అదనంగా శ్రీస్వామి వారి శేష వస్త్రం (శెల్లా, కనుము) అందజేసేందుకు ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. ఆయన వెంట డిప్యూటీ ఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ ఉన్నారు.



ముఖ మండపం క్యూలైన్‌లో భక్తులతో మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

వృద్ధురాలిపై దాడి చేసి ఆభరణాల అపహరణ



దొంగల దాడిలో గాయపడ్డ లక్ష్మమ్మ

నకిరేకల్: వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి ఆమె మెడలోని బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో శనివారం జరిగింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకలపట్టణంలోని వీటీ కాలనీలో నివాసముంటున్న స్థానిక పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు తల్లి లక్ష్మమ్మ ఇంటికి శనివారం మధ్యాహ్నం 2.30గంటల సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అద్దెకు రూములు కావాలంటూ వచ్చారు. తమ ఇంట్లో అద్దెకు రూములు లేవని లక్ష్మమ్మ వారికి చెప్పింది. తాగడానికి మంచినీళ్లు కావాలని సదరు వ్యక్తులు ఆమెను అడిగారు. దీంతో మంచినీళ్లు ఇచ్చేందుకు లక్ష్మమ్మ ఇంట్లోకి వెళ్తుండగా.. ఆమెపై ఆ ఇద్దరు వ్యక్తులు దాడి చేసి కాళ్లు, చేతులు కట్టివేశారు. లక్ష్మమ్మ కేకలు వేయడంతో ఆమె నోట్లో గుడ్డలు పెట్టి మొహంపై పిడుగుద్దులు గుద్దారు. అనంతరం ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసులు, చేతులకు ఉన్న వెండి గాజులు లాక్కొని పరారయ్యారు. కొద్దిసేపటి తర్వాత లక్ష్మమ్మ చేతి కట్లు విప్పుకుని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది. వెంటనే ఆమె కుమారుడు వెంకటేశ్వరావు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో సీఐ రాజశేఖర్, ఎస్ఐ లచ్చిరెడ్డి తమ సిబ్బందితో లక్ష్మమ్మ ఇంటికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి క్లూస్‌టీంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. దుండగుల దాడిలో గాయపడిన లక్ష్మమ్మను నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మను స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు.

వృద్ధ మహిళలే టార్గెట్..

వృద్ధ మహిళలనే టార్గెట్ చేస్తూ కొన్ని రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం నకిరేకల్ మండలం మర్రుర్ గ్రామంలో పుట్ట చంద్రమ్మ అనే వృద్ధురాలు తన ఇంటి బయట కూర్చొని ఉండగా గుర్తుతెలియన ఇద్దరు యువకులు వచ్చి తన మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు గొలుసు అపహరించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని ఓ లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని మహిళ మృతిచెందింది. పట్టణ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని లక్ష్మీ థియేటర్ వెనుక గల లక్ష్మీనరసింహ ఫ్యామిలీ రూమ్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో ఓ వ్యక్తితో కలిసి మహిళ దిగింది. రాత్రి అక్కడే ఉన్నారు. శనివారం తెల్లవారుజామున 5.40గంటలకు మహిళతో వచ్చిన వ్యక్తి బయటకు వెళ్లిపోయాడు. బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి లాడ్జిలోకి రాకపోవడంతో లాడ్జి నిర్వాహకుడు టి. భరత్ వారి గది వద్దకు వెళ్లి చూడగా.. సదరు మహిళ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. పట్టణ ఎస్ఐ అనిల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. మృతురాలి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని ఎస్ఐ తెలిపారు. లాడ్జి నిర్వాహకుడి వద్ద ఉన్న మహిళ ఆధార్ వివరాలను పోలీసులు మాత్రం బయట పెట్టడంలేదు. విచారణ అనంతరం మహిళ వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ పేర్కొన్నారు. లాడ్జి నిర్వాహకుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహిళతో వచ్చిన వ్యక్తి హత్య ఉండాటా.. లేదా ఇద్దరి మధ్య ఏదైనా ఘర్షణ జరిగి మహిళే ఉరి వేసుకుందా.. ఇతర ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మేళ్లచెరువు: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం రాత్రి మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఆటోను పట్టుకుని 2.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ రాయపుడి రాంబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జైన మందిర్‌ను సందర్శించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం

ఆలేరురూరల్: ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గల జైన మందిరాన్ని శనివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మందిర్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

చండూరు: చండూరు మండలం తాస్కానిగూడెంలో శనివారం ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఇరిగి లింగయ్య పూరిగుడిసె నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి లింగయ్యకు సమాచారం ఇచ్చారు. గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ తెప్పించి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా.. అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.



మంటలార్పుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో విచారణ



సూర్యాపేట జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో విచారణ చేస్తున్న రాష్ట్ర వైద్య బృందం సభ్యులు

సూర్యాపేటటౌన్: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించి నడుస్తున్న సూర్యాపేట జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి భారీగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో సూర్యాపేట కలెక్టరేట్‌లో గల డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. ఇందుల్లో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం సభ్యులు పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పర్సనల్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్, డిప్యూటీ సీఎస్ పీసీపీ ఎన్డీటీ డాక్టర్ సుమిత్రా రాణి, డిపూట్యీ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడ్మిన్ శ్వేతా మోహన్‌లు.. డీఎంహెచ్ఓ కోటాచలాన్ని విచారించారు. పలు విషయాలపై ఆరా తీశారు. సూర్యాపేటలో నాలుగు ఆసుపత్రుల పర్మిషన్‌కు సంబంధించిన అన్ని వివరాలు, సర్టిఫికెట్స్‌ను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బృందం స్వాధీనం చేసుకుంది. వీటి పరిశీలన, చర్యల నిమిత్తం సంబంధిత వివరాలను రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రవిచంద్ర నాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ పంపిస్తామని అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ తెలిపారు.

జల నారాయణస్వామికి మంగళహారతులు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో శనివారం జల నారాయణస్వామికి మంగళహారతులు సమర్పించారు. ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన సేవ, నిత్య కల్యాణం జరిపించారు. అదేవిధంగా మధ్యాహ్నం ఆలయ ఆవరణలో సుమారు 4500 మందికి అన్నదానం, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ కార్యక్రమం నిర్వహించారు. శనివారం కావడంలో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



జల నారాయణస్వామికి మంగళహారతులు సమర్పిస్తున్న అర్చకులు

విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్త

- కంపెనీల ప్రకటనలు చూసి రైతులు మోసపోవద్దు

పాడిపంట



పెద్దవూర: మరో పది, పది హేను రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభం కానుంది. రైతులు బోర్లు, బావుల కింద పత్తి విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు పత్తి, మిరప విత్తనాలను సైతం కొనుగోలు చేశారు. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో రైతులు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందని పెద్దవూర మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచిస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు ప్రారంభిస్తున్నాయని, వాటిని చూసి విత్తనాలు కొనుగోలు చేయొద్దని ఆయన పేర్కొన్నారు. విత్తనాలు, పురుగుల మందు ఎంపిక, కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

విత్తనాల ఎంపిక..

- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాల కొనుగోలు రశీదులపై నంబర్, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- గడువు దాటిన విత్తనాలు, వదులుగా, చిరిగిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి ఇచ్చిన ప్యాకెట్లు కొనుగోలు చేయొద్దు.
- రశీదుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకాల పన్ను నంబర్, విక్రయదారుడి గ్రామం పేరు, సంతకం, తేదీలు, విత్తన రకం పేర్లు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్ద తూకం వేయించాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వ్యవసాయశాఖ అధికారి, శాస్త్రవేత్తలను సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన రశీదును పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉన్న వాటినే విత్తనాలుగా వాడాలి.

పురుగు మందుల ఎంపిక..

- పంటలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగుల మందులు కొనుగోలు చేయాలి.
- అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగుల మందులను వాడొద్దు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై చక్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతలో పూడ్చిపెట్టాలి.
- ఒక పంటకు వాడిన పురుగుల మందును మరో పంటకు శాస్త్రవేత్తల సూచనల మేరకు వాడాలి.

ఎరువుల ఎంపిక..

- లైసెన్స్ కల్గిన దుకాణాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలి. బిల్లులు, ఖాళీ సంచులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒకవేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఉండాలి.
- ఎరువులు కొనుగోలు చేసే సమయంలో డీలర్ రికార్డులో రైతులు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై రైతులకు ఏమైనా అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో పరీక్షలకు పంపాలి.
- చిల్లులు పడి, చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయొద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీగా గుర్తించాలి.

కల్తీలను గుర్తించండిలా..

- యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ వంటి ఎరువులు గుళికల రూపంలో ఉంటాయి.
- ఎరువులు ఇసుక రేణువుల రూపంలో, పొటాష్, సూపర్ ఫాస్ఫేట్ పొడి రూపంలో ఉంటాయి.
- 5 మిల్లీలీటర్ల నీటిలో చెంచా ఎరువును వేసి బాగా కలపాలి. ఇది స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించవచ్చు. యూరియా, అమ్మోనియా క్లోరైడ్ ఎరువుల పరీక్షకు 10 మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- యూరియా వంటి ఎరువును ఒక చెంచాను ఐదు మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిలో వేసి బాగా కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి. కొన్ని కాంప్లెక్స్ ఎరువులను ఇదే పద్ధతిలో పరీక్షిస్తే ఇసుక రేణువులు వచ్చే అవకాశం ఉంది. అలా వచ్చినా కల్తీ ఎరువుగా గుర్తించాలి.